క్లుప్తంగా

జగ్జీత్‌సింగ్ దల్లేవాలా ప్రాణాలకు ముప్పు



డిచ్‌పల్లి: నూతన మార్కెట్ వ్యవసాయ విధానాలను విరమించుకోవాలని పంజాబ్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాలా ప్రాణాలకు ముప్పు ఉందని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు ఉద్యమానికి ప్రధాని మోదీ ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీలను అమలు చేయాలని చేపట్టిన ఆమరణదీక్షతో జగ్జీత్ సింగ్ ఆరోగ్యం రోజురోజు క్షీణిస్తోందని అన్నారు. ఆయన ప్రాణాలకు ఎలాంటి ముప్పు ఏర్పడినా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కృష్ణగౌడ్, దేవస్వామి, పద్మ, బన్సీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



డిచ్‌పల్లి: ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) డిచ్‌పల్లి మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ అధ్యక్షుడు మహిపాల్ మహరాజ్ తెలిపారు. అధ్యక్షుడిగా ఉగ్గెర పోచయ్య, ఉపాధ్యక్షులుగా సురేష్, సాయిలు, ప్రధాన కార్యదర్శులుగా మోహన్, దాసు, కార్యదర్శులుగా సాగర్, రాకేశ్, భూషణ్, సాయిలు, కార్యవర్గ సభ్యులుగా మహేశ్, నరేందర్, శ్రీనివాస్, గంగారాం, నర్సయ్య, కుమార్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్, ప్రశాంత్, మండల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ హక్కుల కోసం పోరాడిన వ్యక్తి



నిజామాబాద్ అర్బన్: మాదిగ హక్కుల కోసం నిత్యం పోరాడిన వ్యక్తి మంద జగన్నాథం అని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు సర్కిల పోశెట్టి అన్నారు. సోమవారం ఓల్డ్ అంబేడ్కర్ భవన్‌లో మృతి చెందిన మాజీ ఎంపీ మంద జగన్నాథానికి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జగన్నాథం అందించిన సేవలు మాదిగ జాతి ఎప్పుడు గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, గంగారాం, మహేశ్, గంగాధర్, కేశపురం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోలి సమాజ్ కార్యవర్గ సభ్యుడిగా ఇమ్మడి గోపి



ఇందల్వాయి: కోలి సమాజ్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మాజీ ఎంపీపీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి నియమితులయ్యారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి సమావేశాల్లో అఖిల భారత కోలి సమాజ్ జాతీయ అధ్యక్షుడు మాజీ ఎంపీ కశ్యప్ కోలి ఇమ్మడి గోపికి నియామకపత్రాన్ని అందజేశారు. దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో పిలువబడుతున్న కోలి సమాజ్ ఐక్యతకు, హక్కుల సాధనకు జాతీయ కోలి సమాజ్ కృషి చేస్తుందని ఇమ్మడి గోపి అన్నారు. తెలంగాణలో ముదిరాజ్‌ల ఉన్నతికి కోలి సమాజ్ సభ్యుడిగా కృషి చేస్తానని తెలిపారు.

మెరుగైన వసతులు కల్పించాలి



సిరికొండ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వసతులు కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అనీస్ డిమాండ్ చేశారు. మండలంలోని గడ్కోల్‌లో సోమవారం నిర్వహించిన పీవైఎల్ సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లా ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలందించకుండా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోగులపై వైద్యులు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. నాయకులు అరుణ్, మహి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం గోదారంగనాథుల కల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- అన్నదానాలు, ప్రత్యేక కార్యక్రమాలు



ఉత్తర తిరుమల క్షేత్రంలో..



జెండా బాలాజీ ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

నిజామాబాద్ రూరల్/ డిచ్‌పల్లి/ సుభాష్‌నగర్/ మోపాల్: పవిత్ర ధనుర్మాసం సందర్భంగా సోమవారం నగరంలోని జెండాబాలాజీ మందిరం, ఉత్తర తిరుపతిక్షేత్రం, సుభాష్‌నగర్‌లోని రామాలయంలో, చక్రం గుడిలో గోదారంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణతో ఆలయాల పరిసర ప్రాంతాలు మారుమోగాయి. పవిత్ర ధనుర్మాసం ముగింపు సందర్భంగా సోమవారం డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి వారి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమాండెంట్ సత్యనారాయణ దంపతులు, అసిస్టెంట్ కమాండెంట్‌లు, కుటుంబ సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మండలంలోని ధర్మారం(బి)లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదారంగనాథస్వామి వారి కల్యాణం నిర్వహించారు. మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదారంగనాథ కల్యాణం ఘనంగా నిర్వహించారు. గోదారంగనాథుల కల్యాణంతో ధనుర్మాసం ముగుస్తుందని ఆచార్యులు సంపత్ కుమారాచార్య తెలిపారు. గోదాదేవి ఎంతో నిష్ఠతో 'శ్రీ వ్రతం' చేసి రంగనాథుడిని కళ్యాణమాడి వారిలో లీనమైందన్నారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బెటాలియన్‌లో..



సుభాష్‌నగర్‌లోని రామాలయంలో..



నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమలలో..



డిచ్‌పల్లి: ధర్మారం(బి)లో..

నోరూరిస్తున్న రాజస్థానీ గేవర్..



సంక్రాంతి తెలంగాణ ప్రజలకు ఎంత ప్రత్యేకమో రాజస్థానీ, గుజరాతీ వాసులకూ అంతే ప్రత్యేకం. జిల్లాకు వ్యాపారం కోసం వచ్చి ఇక్కడ స్థిరపడిన ఉత్తరాది వాసులకు తీపి వంటకాలు అంటే చాలా ఇష్టం. గేవర్ అంటే తెలంగాణ వాసులకు పరిచయం లేని తీపి పదార్థం. కానీ కొన్నేళ్లుగా జిల్లావాసులను సైతం ఇది నోరూరిస్తోంది. సంక్రాంతి పండుగ వస్తే తెలుగువారికి పిండివంటకాల్లో ఎంత ప్రాముఖ్యత ఉందో రాజస్థానీలకు గేవర్ అంతా ప్రాముఖ్యత ఉంది. జిల్లా కేంద్రంలో రాజస్థానీలు ఉండడంతో ఇక్కడి వ్యాపారులు కొందరు ప్రత్యేకంగా గేవర్ స్వీట్‌ను తయారు చేస్తున్నారు. నెయ్యితో తయారుచేసే ఈ స్వీట్ అంటే రాజస్థానీలకు ఎంతో ఇష్టం. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి ఈ గేవర్ కోసం ఇక్కడికి వస్తుంటారు. ఈ సీజన్‌లో 5 నుంచి 10 క్వింటాళ్ల గేవర్ అమ్మకాలు సాగుతాయి. నెయ్యితో తయారు చేసిన గేవర్ స్వీట్ కిలో రూ.600, షుగర్‌లెస్ గేవర్ సీట్‌రూ.400లకు విక్రయిస్తున్నారు. నగరంలోని రైల్వేస్టేషన్ వెనుక ప్రాంతంలో ఉన్న గణపతి దేవాలయంపై గేవర్‌ను తయారు చేస్తూ పక్కనే ఉన్న రూమ్‌లో విక్రయాలు చేపడుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

కవి కాసర్లకు సన్మానం



నిజామాబాద్ రూరల్: కామారెడ్డి జిల్లా దోమకొండ సంస్థానంలోని కోటలో కామినేని వంశ వారసులు కామినేని అనిల్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాహిత్య కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రాచీన తెలంగాణ సాహిత్యం, జానపద సాహిత్యం అనే అంశాలపై సభ జరిగింది. తదనంతరం జరిగిన కవి సమ్మేళనంలో ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక అధ్యక్షుడు ప్రముఖ కవి, డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు ప్రాచీన తెలంగాణ వైభవం అనే కవితను వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 18 కవులు ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. నిజామాబాద్ నుంచి ప్రముఖ కవులు డి ప్రవీణ్ కుమార్ శర్మ, డాక్టర్ అన్నం దాసు జ్యోతి ఉన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ కాసర్లను, కవులను కామినేని అనిల్ ఘనంగా సన్మానించారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి..



డిచ్‌పల్లి: బీజేపీ డిచ్‌పల్లి మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కర్ని చంద్రకాంత్‌ను సోమవారం మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న, అందుకు సహకరించిన ఎంపీ అర్వింద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పానుగంటి సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శివారెడ్డి, సతీశ్‌రావు, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, అబ్బులు, సురేశ్, భరత్, రమణ, రాజ్ కుమార్, వినోద్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లావాసికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్‌కు చెందిన రమేశ్ కార్తీక్ నాయక్ తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాష నుంచి రమేశ్ కార్తీక్ నాయక్ తన తొలి కథల సంపుటి 'ఢావ్లో- గోర్ బంజారా కతలు' పుస్తకానికి ఈ అవార్డు దక్కింది. ఒడిషా రాష్ట్రం భువనేశ్వర్‌లోని ఉత్కల్ విశ్వవిద్యాలయంలో 2024 సంవత్సరానికి గాను సోమవారం సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ పురస్కారాన్ని అందజేశారు. జిల్లావాసికి పురస్కారం దక్కడంపై హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, క్యాతం సంతోష్ కుమార్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు.



పురస్కారం అందుకుంటున్న రమేశ్ కార్తీక్ నాయక్

అలాగే కవులు పంచరెడ్డి లక్ష్మణ, డాక్టర్ కాసర్ల నరేష్ రావు, డాక్టర్ గంట్యాల ప్రసాద్, తిరుమల శ్రీనివాసార్య, డాక్టర్ ముద్దుకూరి సాయిబాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నరేశ్

మోపాల్/ డిచ్‌పల్లి: నగర శివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాదల నరేశ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సవిత, స్రవంతి, యాదల నిరూష, యాదల శ్రావణి, రచ్చ ఆనంద్, మామిడాల సునీల్‌కుమార్, వినయ్, కల్లెడ గంగాధర్, రాకేశ్, కామర్తి సాయిరాం తదితరులు పాల్గొన్నారు. సంక్రాంతి సందర్భంగా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీకాశీవిశ్వనాథ ఆలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చింతపంటి రాజారాం, గంగాదాస్, చెంచురెడ్డి, కోటగిరి రాజశేఖర్, జి పటేల్, రేఖ రాము, అశోక్, రాజు, చౌకి రాములు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



శ్రీకాశీవిశ్వనాథ ఆలయం ఆవరణలో..

మూఢ నమ్మకాలను విడనాడాలి



నిజామాబాద్ రూరల్: మూఢ నమ్మకాలను విడనాడాలని రూరల్ పీఎస్ పరిధిలోని పోలీసులు ఖానాపూర్‌లో సోమవారం కళాజాత నిర్వహించారు. గల్ఫ్ ఏజెంట్‌ల ద్వారా యువకులు మోసపోవద్దని, సంక్రాంతి సెలవుల్లో వేరే గ్రామాలకు, పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు వెళ్లేవారు స్థానిక పీఎస్‌లలో సమాచారం అందించాలని సూచించారు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు కళాజాత సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



బాల్కొండ: బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మెండోరా మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పసుపుబోర్డు ఏర్పాటుపై గడుగు హర్షం

నిజామాబాద్ సిటీ: జిల్లాలో పసుపు బోర్డు కార్యకలాపాలు నిర్వహించేందుకు కేంద్రం ఏర్పాటు చేయడంపై రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ సోమవారం హర్షం వ్యక్తం చేశారు. పసుపు రైతుల కష్టాలు ఈ సంక్రాంతి నుంచి తీరనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పసుపు బోర్డు ద్వారా తెలంగాణ పసుపు ప్రపంచ దేశాలకు చేరనుందని పేర్కొన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసి, కార్యకలాపాలు చేపడుతున్నందుకు తెలంగాణ పసుపు రైతుల తరఫున కేంద్రానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. పసుపు బోర్డు చైర్మన్గా జిల్లా రైతును నియమించడం హర్షనీయమన్నారు.

ఆటోలలో సీట్ల తొలగింపు



ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్ బస్టాండ్ వద్ద ఆటోలలో డ్రైవర్‌కి ఇరువైపులా ఉన్న అదనపు సీట్లను సోమవారం ట్రాఫిక్ పోలీసులు ప్రసాద్, చంద్రమోహన్, రహమతుల్లా తొలగించారు. ప్రసాద్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. లేనియెడల చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి

నిజామాబాద్ రూరల్: సంక్రాంతి పండుగను జిల్లా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు ఉంటుందని, భోగి, సంక్రాంతి, కనుమ తెలుగు ప్రజలకు ఎంతో ఇష్టమైన పండుగని ఆయన పేర్కొన్నారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరపుకోవాలని కోరారు.

ఘనంగా భోగి వేడుకలు



ఏడో బెటాలియన్‌లో భోగి వేడుకల్లో అధికారులు

సాక్షి నెట్‌వర్క్: డిచ్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాలు, ఏడో బెటాలియన్‌లో సోమవారం భోగి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. గంగిరెద్దులు తమ విన్యాసాలు ప్రదర్శించాయి. సాయంత్రం పిల్లలకు భోగి పండ్లతో నోములు నోచుకున్నారు. నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల ఆలయంలో నిర్వహించిన భోగి వేడుకల్లో మొబైల్ కోర్టు జడ్జిలు చైతన్య, హరికుమార్, ఆలయ ధర్మకర్త శ్రీమాన్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సిరికొండ మండలంలో భోగి వేడుకలను ప్రజలు వైభవంగా నిర్వహించారు.



నర్సింగ్‌పల్లిలో..



డిచ్‌పల్లి మండలం ధర్మారంలో గంగిరెద్దు వద్ద యువతులు, చిన్నారులు



డిచ్‌పల్లి మండలం ధర్మారంలో భోగి వేడుకల్లో మహిళలు



సిరికొండలో..









సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పలు చోట్ల మహిళలు, యువతులు, చిన్నారులు తమ ఇళ్ల ఎదుట వివిధ రకాల ముగ్గులు వేశారు.

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని బొడెమ్మ చెరువు సమీపంలో ఉన్న మహాగణపతి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిలుముల భూషణ్ చారి, అర్చకులు సంజయ్ శర్మ, కమిటీ సభ్యులు మహిపాల్‌రెడ్డి, అభిమన్యు, మురళి, శ్రీనివాస్, రవిచారి, శ్రవణ్, భూపాల్, రాజ్‌కుమార్ సుబేదార్, ఆశనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సిద్ధుల గుట్టపై ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంతాల్లోని రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మ, హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	80,500	వెండి(కిలో)	95,000
22 క్యారెట్స్	74,280	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	70	100	పచ్చిమిర్చి	50	80
జీరకాయ	60	100	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	40	60
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్‌రూట్	30	50
పాలకూర	30	50	కరివేపాకు	70	100
మెంతికూర	25	50	చామగడ్డ	50	80
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	90	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)	
స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.40,4.30,7.30, 10.20
స్క్రీన్-2	గేమ్‌ఛేంజర్(తెలుగు)-10.20, 1.20,4.30,7.30,10.30
స్క్రీన్-3	డాకుమహారాజు(తెలుగు)-11.00, 1.35,4.25, 7.20, 10.20
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)	
స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.00,1.05, 4.10,7.15,10.20
స్క్రీన్-2	డాకు మహారాజు (తెలుగు)- 10.10, 1.20, 4.30, 7.40, 10.50
స్క్రీన్-3	గేమ్ ఛేంజర్(తెలుగు)- 11.50, 3.20, 6.50,10.20
స్క్రీన్ -4	పుష్ప-02(తెలుగు)-10.25, 6.00, 10.05 -గేమ్ ఛేంజర్(తెలుగు)-2.30
లలితామహల్	గేమ్ ఛేంజర్(తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	గేమ్ ఛేంజర్(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)